# విడిచి వెళ్ళిన విరాగి

★

**శ్రీ తనికెళ్ల జగన్నాధం**

"నిర్మలా!"

. . . . . . . . . . .

"నిర్మలాదేవి!"

అదరిపోయి చెదిరి పోయింది శాంతమ్మ. అసహజ మైన ఆ సంబోధన ఏదో కల్లోలం చెలరేగించే టట్లుగా తోచిం దామెకు. తనకు తెలియకుండానే చిరుచెమటలు ఆమె దేహాన్ని కప్పి వేశాయి. ఆ సంబోధనలోని గంభీరత ఆమెను కదలించివేసింది.

"క్లబ్బుకు వెళ్ళింది" కొంచెం ముక్తసరిగానే సమాధానం యిచ్చింది.

"ఎవరి నడిగి......?" ఉరిమాడు శివానందు.

"రోజూలాగే........!" నోరు జారినందుకు నాలుక కరచుకొంది శాంతమ్మ.

"అయితే నేను రోజూ సాయంకాలం షికారుకు పోతుంటే యీమె క్లబ్బులకు వేం చేస్తోం దన్న మాట నాకు తెలియకుండా. ఏమి స్వాతంత్ర్యం— ఏమి వినయం! నలుగురు దృష్టిలోను పడుతున్నా నన్నైనా భయం లేకుండా రాద్ధాంతం సాగిస్తోందన్న మాట. ఈ విషయం తండ్రికి తెలిస్తే ఎంతగా బాధ పడతాడన్నైనా లక్ష్యం లేకుండా ఆడుతోం దన్నమాట—ఆట. నా బుద్ధి తక్కువతనం కాకపోతే ఆడదానికి స్వేచ్ఛ యిమ్మని ఎవరు చెప్పారు!

అమ్మాయిని అలా క్లబ్బులకు, నాటకాలకు పొమ్మని స్వేచ్ఛగా వదిలెయ్యకపోతే కాస్త అదుపులో పెట్టుకోలేకపొయ్యావు! చేతులు కాలాక ఆకులు పట్టుకుందా మనుకున్నావా!" గంభీర వదనం ఎర్ర వారింది. హృదయంలో అగ్నిగోళాలు యిమిడి పోతున్నాయి.

"ఇంతకీ ఏమయిందండీ........!"

"తెలివితక్కువ దద్దమ్మలకు హరికథలు చెప్ప గలరు మీరు. అరవై సంవత్సరాల జీవితంలోని అనుభవాన్ని మోసిన శివానంద్ దగ్గరా మీ నాట కాలు: అదుపులో పెట్టుకోలేకపోతే చెప్పు. అప్పుడు నేను చూసుకుంటాను తతంగం. మొక్కయ్యై వంగనిది మ్రానై వంగదు శాంతీ! నీ కిప్పు డిదంతా ముద్దుగా తోచినా తన ప్రవర్తన మితి మీరిం దంటే నోరు చప్పరించాల్సి వస్తుంది. తెలుసుకొని కాస్త బుద్ధి చెప్పు. రేపటినుంచి యీ క్లబ్బు వ్యామోహాలు—గాలి షికార్లు బందు చెయ్యవలసి వస్తుందని చెప్పు—అవసరమైతే కాలేజీ చదువుకూడ......" కంఠం రుద్ధమయింది తండ్రిగా అపజయాన్ని పొందుతున్నందుకు.

కుక్కిన పేనులా అయిపోయింది. శాంతమ్మ పరిస్థితి. మారు మాటాడకుండా వెనుతిరిగి పోయిం దామె.

"నిర్మలా......"

"ఆ........"

"నీకు చెప్పవలసిన విషయాలు కొన్ని ఉన్నాయి. అయితే అవి ఆజ్ఞలుగా తీసుకోలేకుంటే సలహాలుగా తీసుకో. ఏమయినా నేను చెప్పేవి అనుసరించక తప్పదు. కాస్సేపు నిశ్శబ్దంతో స్తబ్ధుగా యుండి పోయా రాయన.

అటువంటి సమయంలో తండ్రి మాటలకై ఆకట్టుకొని కూర్చోవడం దుస్సహ మనిపించింది నిర్మలకు. అయితే ఆయన చెప్పబోయే విషయాలు అంతకుముందే తల్లివలన తెలుసుకొంది. వాటిని అలక్ష్యం చేయడంవలననే తండ్రి యత్నానికి మూలం. కంఠం సరిదిద్దుకొని అందుకొన్నా రాయన.

"ఈ మధ్యన నీ ప్రవర్తన నన్ను సంతోష పెట్టడం లేదు నిర్మలా. స్త్రీ జీవితంలో ప్రతి వ్యక్తి వాంఛించేది సహజమైన సిగ్గు—వినయ మూను. అవి రాను రాను నీలో క్షీణించిపోతున్నాయి. పైగా నన్ను గూడ అలక్ష్యంచేసి తిరుగుతున్నావు. అసభ్యతకు దోవతీసే పనులు చేయకూడదు నిర్మలా. శిష్ట సమాజంలోని వారం మన కసలు తగదు. ఇంటర్‌లో క్లాసు సంపాదిస్తావని—ఎమ్. బి. చదువుతావని ఆశతోఉన్న నేను యీ సమయంలో నీ ప్రవర్తన తెలిశాక ఎంతగా గాయపడ్డానో తెలుసా. ఇటువంటి సభ్యతకు విరుద్ధమైన పనులు చేస్తావని అనుకోలేదు నిర్మలా. కనీసం వూహించ నైనా లేదు నిర్మలా!" అవ్యక్తమయిన విషాదం వ్యక్తమవుతోంది ఆ మాటలలో.

"క్షమించు నాన్నా!—" ప్రాధేయపడ్డట్లుగా అంది.

"క్షమిస్తే మానుకుంటావా నీ దుష్కృత్యాలు.

"క్లబ్బుకు వెళ్ళడం మానుకోవడమేనా....."




హైద్రాబాద్ బ్రాంచి: సుల్తాన్ బజార్ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
హైద్రాబాద్ ఎదురుగా (దక్కన్)

"అంతే కాదు"

"మరి!"

"కాలేజీ కూడ......!"



అచేతనయ్యై ముగ్ధత్వంలో మూర్తీభవించే సౌందర్యరాశిని లోలోపలే దాచివేసుకుంది. వినిర్మల వదనారవిందంలో అస్పష్టమైన చీకటి ఛాయ లేర్పడ్డాయి. హృదయంలో ఏపుగా పెరిగిన ఆశాలత విరిగిపోయినట్లుగా మనోభావాలు పైకి వ్యక్తమవుతూనే ఉన్నాయి. ఒక్కసారి శరీరం రంగును మార్చుకొంది. ధవళతపోయి రాగ రంజితమైంది.

కాస్సేపు నిశ్శబ్దం వారిమధ్య అధికారం వహించింది.

"అసంభవం నాన్నా!" తనకు తెలియకుండానే అనేసింది.

శివానందంగారి అనుమానం నిజమయింది. తోటి లెక్చరర్ చెప్పగా యింకా అపనమ్మకం దేనికి?

ఒకనాడు అకస్మికంగా రోడ్డుమీద తగిరి "మీ నిర్మల యింగ్లీషు లెక్చరర్ శేఖర్‌తో ప్రణయం సాగిస్తోంది. కాలేజీలో చాలా గల్లంతు తెచ్చే వ్యవహారంలాగుంది చూస్తుంటే. రిటైరుడు పోలీసు ఆఫీసరు కూతురువై యుండి కూడా చేతకాని దద్దమ్మలాగు అదుపులో పెట్టుకోలేకపోయావంటే ఆశ్చర్యమే. కాలేజీ కుర్ర కారు వూరుకోకుండా పేపరులో కెక్కించే తతంగంలో ఉన్నారు' యిలా అన్న మాటలు క్రమం తప్పకుండా చెవులలో రింగులు తిరుగుతున్నాయి. అగ్నిగోళాలు లోపల పగులుతున్నాయి కాబోలు కందగడ్డలా తయారయిం దాయన మొహం.

"అసంభవం......ఎందుకు అసంభవం కాదు. నీ రహస్యాలన్నీ నాకు తెలియవని అనుకున్నావు కాబోలు. నాకు తెలియకపోతే లోకానికైనా తెలియ దనుకున్నావా. మీ లెక్చరర్ శేఖర్‌తో తననే పెళ్ళి చేసుకుంటావని వాగ్దానం యిచ్చావటగా. అయితే చాలా దూరం పోయిం దన్నమాట వ్యవహారం. ఇంత అవినీతికి పాల్పడతావని కలలోనైనా వూహించ లేదు నిర్మలా! నైతిక నియమాలకు లొంగి ప్రవర్తించవలసిన అవస్థ నీకు లేదు లాగుంది. సాంఘిక ధర్మాలను త్రోసిపుచ్చి అవినీతికి....అధర్మానికి.... అనాచారానికి లోబడుతున్నావంటే మానసిక దౌర్బల్యతను పెంచుకుంటున్నా వన్నమాట. పైగా మన కారులో అతనిని తన బసకు దిగబెడుతున్నావటగా. ఏమయినా సరే రేపటినుంచి నీవు యీ ఆటలకు స్వస్తి చెప్పాల్సిందే" తన స్థిరాభిప్రాయాన్ని వ్యక్తపరచాడు.

శేఖర్ విషయం తండ్రికి తెలియ దనుకొన్న నిర్మల అచేష్టితయ్యై వింటోంది.

"పరీక్షలు నాలుగు నెలలలోనే ఉన్నాయి కనుక శలవు పెట్టెయ్యి కాలేజీకి. అవసరం అయితే అటెండెన్సు కోసం యూనివర్శిటీకి డబ్బు కడతాం. నీవు క్లాసు సంపాదిస్తావని ఆశించాము కాని యిప్పుడా ఆశ పూర్తిగా నశించిపోయింది. దానికీ నీ ప్రవర్తనే కారణం. ఈ కొద్దికాలం అయినా శ్రద్ధగా చదివి కనీసం ప్యాసు అన్నా అవుతావేమోనని ఆశిస్తాను. వచ్చే ఏడాది ఏమయినా నీవు "మెడిసిన్"లో జాయినవడం తథ్యం. పదివేలు కాకపోతే యింకో పది యిస్తాను విరాళం. ఇచ్చి సీటు సంపాదించే బాధ్యత నాది. ఇప్పుడు ప్యాసయ్యే బాధ్యత నీది. తరువాత—అంటే చదువయిన తరువాత ఏ 'ఫారిన్ రిటర్న్'"డునో పెళ్ళి చేస్తాను. నా యీ ఆశలకు భంగం కలగడం ఎన్నటికీ జరుగకూడదు. మీ క్లాస్ టీచర్ శేఖర్ గదూ! శలవు చీటి వ్రాసి పంపెయ్యి మాట్లాడకుండా....." సమాధానం ఆశించకుండానే వెనుదిరిగి లోపలకు పోయారాయన.

పిడుగులాంటి ఆజ్ఞ—దుర్భరం.... .దుస్సహం. కాలేజీ మాని యింట్లోనే గడపడ మెలాగు? ముఖ్యంగా పూర్ణ స్వాతంత్ర్యాన్ని అనుభవించిన నిర్మల యీ ఆజ్ఞలు, కట్టుబాట్ల మధ్య జీవించడ మెలాగ......? అసంభవం. అయితే తండ్రిని ధిక్కరించి చేయగలిగిందేముంది? పరిస్థితులు మరీ విషమిస్తాయి. ఇకనుంచి తను కేవలం రాణివాస స్త్రీయే..... జైలులో బందీయే.......పంజరంలో చిలకయే. అబ్బ! యివన్నీ తలచుకొంటూంటే గుండె బరువెక్కిపోతోం దామెకు. హృదయంలో పెనుతుఫాను.....మనస్సులో సుడిగుండం.....ఆత్మలో అవమానంతో నిండిన వేదన. కను కొలకులలో కన్నీటి కణాలు కొన్ని చోటు చేసుకున్నాయి.

అన్యమనస్కయై అలాగే కూర్చుండి పోయిం దామె కొంతసేపు. ఇంతలో సంధ్య చీకట్లు అలుముకుంటున్నాయి. పడమటికొండల వెనుక ఆకాశం అరుణారుణమైంది. పక్షులు బారులు తీర్చి నీలాల [illegible] పై స్వేచ్ఛగా విహరిస్తున్నాయి, ఇక ఈ ప్రకృతి శోభలోని మాధుర్యం కూడ తనకు కరువే అనుకుంది నిర్మల.

''మెడికల్ లీవు'' పెడితే గాని ఒప్పుకోరంటే శివానందంగారు స్వయంగా డాక్టరువద్దకు పోయి ఎలాగైతేనేం సంపాదించారు దానిని. డ్రైవరు దానిని తీసుకొని కారులో పోతుంటే కాలేజీ విద్యార్థులు.... ముఖ్యంగా శేఖర్ అనుమానించారు ఏం జరిగిందో నని. సైకిలు మీద తను వస్తుంటే యీ కారు ప్రక్కనుంచి దూసుకుపోయింది. కాని దానిలో నిర్మల కనుపించలేదు. కొంత కంగారుపడ్డాడు శేఖర్.

సవినయంగా జరిగిందంతా చెప్పాడు డ్రైవర్ రాజు. ఆ విషయంలోనే వేళాకోళం ప్రస్ఫుటంగా వ్యక్తమౌతోంది. శేఖర్ కొంచెం అవమానంతో బాధ పడ్డా పైకి మాత్రం కనుపించనీయలేదు. తనకూ—నిర్మలకూ ఎడబాటు తప్పదు....ఒకవేళ తనకు కనిపించినా మాట్లాడదు—మూగనోము పడుతుంది. అయినా కాలేజీ వాతావరణం కూడ బాగాలేదు. విద్యార్థులంతా తనని గేలి చేస్తున్నారు. ఏవేవో బోర్డులమీద వ్రాస్తున్నారు. తనని ఒక ఆట ఆడిస్తున్నారు. గౌరవ వినమ్రభావాలు ఎప్పుడో నశించిపోయాయి. అయితే యింకా త నెందుకో యిక్కడ ఉండడం అనిపించింది శేఖర్‌కు.

★

నిర్మలకు దినచర్యలన్నీ ''రొటీన్''గా జరిగి పోతున్నాయి. ఇల్లే తన కైలాసంగా ఉం దామెకు. పట్టుకు మించిన పరమార్థం మరి లేనట్లుగా అయిం దామెకు. కనీసం స్థాన భ్రంశం అన్నా ఉంటే కొంత వేడి తగ్గుతుంది. రోజు రోజుకు అశాంతి ఎక్కువైపోతోంది. శేఖర్‌ని తలచుకొంటూంటే ఏవో విషాదవంతమైన మూగ భావాలేర్పడుతున్నాయి. ఒక మూల తండ్రికి తనమీద నున్న సదాశయాలకు సంతృప్తి—మరొక మూల శేఖర్ తనకు దూరమవుతున్నాడనే అసంతృప్తి—ఇవన్నీ హృదయాన్ని కలచివేస్తున్నాయి. ఏదో విధమైన బాధ తనని కృశింపజేస్తోంది. ఎంతగా ప్రయత్నించినా ఆ మమత చెరపరానిదైపోతోంది. తన మనస్సులో శేఖర్ అంతకంతకు దగ్గరవుతూనే యున్నాడు.

పుస్తకాలు తీస్తుంది—కాని చదవలేకపోతుంది. ఒకవేళ చదివినా బోధపడడం లేదు. దృష్టి అంతా శేఖర్ పైననే. ఆ విధంగా ఏకాంతంలో శివ మౌతూంటుంది. అప్పుడప్పుడు కన్నీటి ధారా ప్రవంతులు కట్టలు తెగి బయల్పడుతున్నాయి. అప్పుడే జీవితంలోని కొన్ని పరమసత్యాలు తెలుసుకో గలుగుతోం దామె.

★

ఎపుడూ మేడమీదకు రాని శివానందంగారు ఆ రోజున వచ్చారంటే కొంచెం ఆశ్చర్యంగానే తోచింది నిర్మలకు. కొంచెం ఆనందం తొంగి చూస్తోంది. అంతటి గంభీరత్వంలోను ఆయనకు ఏవో చెప్పబోయి ''ఫాన్'' వేసుకొని కాస్సేపు కూర్చున్నారు సోఫాలో. నిర్మల కిదంతా వింతగా తోచింది. అయినా ముందర తాను పలుకరించ దలచుకోలేదు.

కాసేపాగి ''చదు వెలాగుంది నిర్మలా.....'' ప్రశ్నించాడు.

''బాగానే యుంది'' ముక్తసరిగా సమాధానం యిచ్చింది.

''కాలేజీకి వెడతావా ఏంటి?''

''వద్దు నాన్నా.''

''ఏం!''

''నీమీద నాకు ప్రత్యేకమయిన కక్ష ఏమీ లేదు నిర్మలా. కేవలం నిన్ను బాధించే ఉద్దేశంమీద కాదు నిన్ను కాలేజీకి వెళ్ళకుండా యింట్లో ఉంచింది. లోకం పోకడలు తెలియక నన్ను కఠినుడుగా........కసాయివాడుగా భావించావు నీవు. అయినా నీవు నన్నొకప్పుడు దర్శించుకుంటావులే—ఆ రోజు తప్పకుండా వస్తుంది. నీ బాగుకోసమే నే నలా చేశానని తెలుసుకో నిర్మలా....నీవు యిపుడు తెలుసుకోపోయినా యిక ముందైనా తెలుసుకుంటావులే. నీ ఏకాంతం యింకా మితిమీరకూడదు. తప్పకుండా కాలేజీకి వెళ్ళాలి. ఈ చిన్న కోర్కెను నెరవేర్చలేకపోతే యీ ముసలి తండ్రి మనస్సు బాధ పడుతుంది నిర్మలా'' అనురాగం ఉట్టిపడుతోంది ఆ మాటలలో.

ఒప్పుకోక తప్పింది కాదు నిర్మల. అయితే లోపల వెళ్ళాలని యున్నా మొదటే వ్యక్తపరచలేదు ఆ అభిప్రాయం.

మామూలుగానే కారు నిర్మలను తీసుక పోతోంది కాలేజీకి. హృదయంలో ఆవేదన.....ఆరాటనలు మిళితమైనాయి. ఒకవైపు శేఖర్‌ని చూడాలనే ఆతురత......మరోవైపు అలా కూడదనే ఉద్దేశంతో వెలువడే అస్పష్టమైన చీకాకు. కారు హారన్ కొట్టుకుంటూ ముందుకు దూసుకుపోయి కాలేజీ ఆవరణలో ఆగింది.

''శేఖర్ ట్రాన్స్‌ఫరైపోయి వెళ్ళిపోయాడు''—నేస్తం సరూ మాటలు.

గాఢమైన నిట్టూర్పు నోటిని ఆర్పివేసింది. మొహం ఎర్రబారిం దామెకు. ★

పడవలో.....



ఫొటో: శ్రీ ఎస్. వి. కె. మధుసూదనరావు